


అన్నట్టు మీరు విన్నారో లేదోగాని దెబ్బకి డంగై యూరుకున్నాడంత పెద్ద స్టారూను....నమస్తే సార్ నమస్తే ఏం జేస్త్రాం నలుగురితో పాటే నారాయణా అన్నారు మరి. నాకు పట్టుబడుతోంది నమస్తే లాంగ్వేజి--ఏమిటి పబ్లికు మీటింగా! లేటెస్టు కళాఖండం తీసినాయనకి సన్మానమ్మాటేనా మీరనేది. ఇక్కడే. ఇదిగాదూ మీటింగూ? అదిగో ఆ పవరు హావును దగ్గిర్నించి ఈ చివర్న పార్కుదాకా పాండీబజారు పొడుగునా తురాయి చెట్లకింద జరిగేది బహిరంగసభ గాపోతే మరేవిటనుకున్నారు. అలా నవ్వుతారేం సార్. ఇదంతా ఒహటే సభ. మీకు తెలీందేవుంది, విశ్వగుణాదర్శపువా డన్నట్టు తెలుగువాడు కాస్త సందడయిన మనిషి గదండీ, పెద్దసభ పెడితే ఏ డజనుమందో మాటాడిందికి వసతుంటుంది.

మిగతా ఐదొందలమందీ కూడా మాటాడదల్చుకున్నవాళ్ళే గదా, అందుకని లేటెస్ట్ ఫాషనేవిటంటే ఆ యొక్క పెద్దసభకి నూరు బ్రాంచీలు ఏర్పాటు చేసి పదెకరాల బజార్లో నూరు చిన్న మీటింగులు పెట్టుకోడం. ఒహొక్క దాంటో ఐదారుగురుంటారు. చక్కగా అంథా ఒక్కమారే మాటాడుకోవచ్చు. అదే రైటంటాను నేను. ఒహడు చెప్పే దేవిటండీ మనకీ. ఆ మాత్రం మనవూ( చెప్పగలవు(. అంచేత మీదయ, మీ చిత్తం. ఈ రోడ్డు పొడుగునా సాగుతున్న నూటొక్క సభల్లోనూ మీ మాటొక్కటే చెల్లుతుందని గ్యారంటీ కనిపించిన ఎందులోకైనా వెళ్ళవచ్చు. అంతా ఒకటే నన్నాడు కవి. కోటి నదులు--అనిన్నీ అన్నాడు. వినడం మాత్రం పని పెట్టుకుంటే ఇక్కడే నిలబడొచ్చు. పక్కదాంటో మీ స్పీచికి పాయింట్లు తక్కువైనా మోసింది కేవీ( లేక ఒళ్ళు తేలిపోతున్నా కూడా ఇక్కడే నిలబడొచ్చు. విషయాలు నచ్చకపోతే చేతికొచ్చిన వేషం చెయిజారినవాడిలా మొహం ముడుచుక్కూచోవచ్చు.

ఆహా, కళాఖండం గురించే మాటాడుకుంటున్నాం. ఏదో మీకు తెలుసుగా. మనకి మామూలుగా ఏడాదికి పాతిక పిక్చర్లొస్తే వాటిలో మూడు హిట్టయి, మరో మూడిటికి పెట్టిండబ్బొస్తే మిగతావి వెరసి మొత్తం పన్నొనిమిది కళాఖండా ల్తేల్తాయి. అందులో ఏదీ అన్నది తెలుసుకుంటే మంచిది. సంగతులు బాగా బోధపడతాయి.

* * * *

మొత్తానికి మహామంచి పన్జరిగింది లెండి. లేపోతే ఏవిటిటా కొత్త... వీడి బోడికొత్త వీడూను. ఇన్నాళ్ళాయి దీన్ని కనిబెట్టుక్కూచున్న జెజెమ్మల్లాటివాళ్ళక్కొరుకుడు పళ్ళేదు తెలుగూ అడియన్సు క్కావలసిందేవిటో. పెద్దపెద్ద జైంట్లు డీడిక్కులు కొట్టుకుంటున్నారు. ప్రాచీన సంప్రదాయాల్ని బూజుపోకుండా కాపాడుకొస్తున్నవాళ్ళు వాటిని ఎంత జూసినా తరుణోపాయం ఏవిటో పట్టుగోలేకపోతున్నారు. మజ్జిన వీడొచ్చి నావల్టీతో ఫిలింఫీల్డుని చెరిగవతలపారేస్తానంటే యలా, మజాకావా. అన్నీ కొత్తపద్ధతులు పట్టుగొచ్చి రుద్దేస్తానండానికి వీడేం రాజారామ్మోహన్రాయా, వీరేశలింగం పంతులా. మహమహవాళ్ళకే దిక్కులేదు. సత్యజిత్రాయికి దిక్కుందా--సీమదొర్లా విరగబడిచూసి ఊహూ ప్రయిజులు గుప్పించేదాకా.

వీడు ముల్లంగిదుంపలా వచ్చేసి, సిన్డ్రెల్లాలా ఒక్కమారు గోల్చేసి నెగ్గేసి పిక్చర్ని హిట్ చేసుకుంటే ఉన్నవాళ్ళకి ఇన్సల్టు కాదూ. అక్కడికి వీళ్ళంతా వట్టి చెవలాయలూ, వీళ్ళ బుర్రలు చవిటిపర్రలూ అయినట్టు గాదూ. సెల్ఫు రెస్పెక్టున్న ఎవడు సహిస్తాడండీ.....

ఏవిటో సెలవిస్తున్నారు మీ పక్కాయన చెవిలో. నావి పావుచెవుల్లెండి. ఔను ఒప్పుకుంటాను. మేవంతా ఆ పిక్చర్లో పనిచేసి డబ్బుచ్చుకున్నవాళ్ళవే....లేపోతే పుచ్చుకుందావని ఆశపడ్డవాళ్ళవే గావచ్చు. అయితే మటుకు పుచ్చుకున్న మేరకి మెచ్చుకున్నాంగా పిక్చరు తీస్తున్నపుడు....మరి మా మాటిలా అయితే ఏవీ్వ సంబంధం లేకపోయినా శక్తివంచన లేకుండా షూటింగులు కాన్సిలు చేసుకు మరీఊహ ఉప్పొంగిపోతున్న ఇతర మోతుబర్ల మాటేవిటిటా. వాళ్ళంతా పొగరు మోతుబర్లనేనా మీ తాత్పర్యం. వాళ్ళ ఆనందం అంతా అబద్ధవనేనా?

ఏమోలెండి. మీరు బిక్కమొహం పెడితే ఇందాక వొచ్చినాయన పార్టీయేమో అనుకున్నాను. ఆయన ధుమధుమలాడిపోయాళ్ళండి. నోమాన్ ఈజె నైలెండన్నాళ్ళండి. ఈ భూ ప్రపంచంలో ఎక్కడ ఏ జీవి చచ్చినా కాస్త చెక్కు లేచినా మిగతా చరాచర జీవకోటి అంతటా ప్రతిప్రాణి లోనూ ఒక జీవకణం చచ్చిపోతుందనిన్నీ, అందువల్ల ఎక్కడో చర్చిలో గంట మోగితే ఎక్కడో హరహరా అంటూ పల్లకీలేస్తే ఎవడో పోయింటాడనుకో రాదుట.

మనలో ఒక అణువు మరణించిందనటానికి భోర్న యాడవాలిట. మనందరిదీ కలిసి ఒక మహాశరీరంట.....అయ్యా ఇదీ వరస. ఆయన్చెప్పొంచ్చిందల్లా ఇదే. ఒక పిక్చరు కళాఖండవై పోయిందని మనం ఆనందపడ్డం ఏవీ బాగులేదుట. ఒక ప్రొడ్యూనర్ జైపరమేశ్వరా అంటూ జెండా ఎత్తేసుకున్నందుకు చప్పట్లుకొట్టీ పార్టీలు ఇచ్చుకోకూడదుట. ఇండస్ట్రీలో ఏ ప్రొడ్యూసరు దెబ్బతిన్నా ఆ నష్టం అందరికీ తగుల్తుందిట. ఇండస్ట్రీలో తీస్తున్న పిక్చర్లన్నీ ఒక్కటే మహాపిక్చరుట. (కథా కమామీషుల విషయంలో ఈ ముక్క రైట్ అనుకోండి) అంచేత ఒక పిక్చరు దెబ్బతింటే అది మిగతా పిక్చర్లన్నిటికీనుట. ఒక ప్రొడ్యూనర్కి చిరాకేసి వెళ్ళిపోతే పరిశ్రమకి లోటుట. ఇంక కొత్తవాళ్ళు రారని భయపడాలి. అంచేత మనం అలా క్రూరంగా మనిషి పేర్లమీద, పిక్చరు పేర్లమీద చవట జోకులు వేస్తూ నిద్రాహారాలు మానేసి హేళన సప్తాహోరాత్రులు చేస్తూ కూచోడం సిగ్గుచేటుట. మనం బాధపడాల్ట.

బాధెందుకంటే, నాకు తెలీకడుగుతాగాని, మంచిదేగా ఈ వెర్రి మొర్రి మనుషులొచ్చి పిచ్చి పిచ్చి పోకిళ్ళుపోతే--అవి హిట్లయి వాటికి పతకాలూ గట్రా వచ్చి పేట్రేగిపోతే కొంపలు మునిగిపోవుటండీ. సనాతన భారతీయ చిత్రసంప్రదాయం సంక్షుభితం అయిపోదుషండీ. ఏవిటంటా వీళ్ళూ వీళ్ళ కొత్తానూ. సృష్టిలో ఏది కొత్తగా వుంటుంది. సూర్యోదయం తీసుకోండి. నే జూసినంతలో నా చిన్నప్పట్నించి ఒక్కడే సూర్యుడు మొహం చూపిస్తున్నాడు. ఆదే మొహం ఎన్నాళ్ళుంచి చూసినా. ఎపుడేనా మొహానికింత కొత్తరకం మబ్బు పూసుకుంటాడు తప్ప. ఇహపోతే వాడు చేసేపని ఉదయించడం, అస్తమించడం. అంతేగదా? ఎన్నాళ్ళయినా తూర్పునే ఉదయిస్తాడు గదా! పువ్వులు పరిమళమే గుబాళిస్తాయి తప్ప గ్రాంఫోను పాటలు పాడవు కదా.రామాయణం ఎన్ని సార్లు ఎందరు వ్రాసినా రావణుడు సీతను ఎత్తుకు పోతాడు తప్ప కైకనో కౌసల్యానో మందరనో వెరైటీకైనా ఎత్తుకుపోడు గదా. రాముడు రావణాసురుణ్ణి చంపుతాడు తప్ప విభీషణుడిని ఖూనీ చేయడు గదా! అప్పారావు అప్పు చేస్తాడే తప్ప ఇవ్వడు కథా. మీరు బలవంతాన కాఫీ ఇస్తారేతప్ప నా చేత పుచ్చుకోరు గదా. బలవంతాన మనమంతా క్రొత్త ప్రొడ్యూసర్లని, పిక్చర్లని ఎత్తిపొడుస్తావే తప్ప పైకెత్తి ఓహో అనిగాని అయ్యోఅనిగాని ఆనం గదా. అలాటపుడు టెలుగుసినిమా కాంపోజిషన్ మటుకు ఎందుకు మారాలీ అంట. చెప్పండీ,మాటాడ్రేం. డైలాగు మర్చిపోయిప డైరెక్టర్లా, పోర్షనయిపోయిన పరంధామయ్యలా మాటాడ్రేం?

